సాక్షి చిత్తూరు
మంగళవారం । 14 । నవంబర్ । 2023



సేవలు మరిచి..
జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవల్లో నిర్లక్ష్యం దాపరిస్తోంది. సిబ్బంది, అధికారుల కుంటిసాకులతో ఆస్పత్రి కుంటుపడుతోంది. - 8లో



పేదల బలగమే వైఎస్సార్‌సీపీ
పేదల బలగమే వైఎస్సార్ సీపీ అని విజయానందరెడ్డి అన్నారు. తుమ్మిందలో 50 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. - 8లో



పంటలపై ఆగని గజదాడులు
కల్లూరు మండలం కమ్మపల్లె పంచాయతీలో రెండురోజులుగా పొలాలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. - 8లో

న్యూస్‌రీల్

17న ప్రెస్ అకాడమీ చైర్మన్ జిల్లాకు రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 17వ తేదీన జిల్లాకు రానున్నారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆ ఉత్తర్వుల మేరకు ఆయన ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు జిల్లాలోని కాణిపాకం విచ్చేస్తారు. 7 గంటల వరకు కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం అక్కడ నుంచి తిరుమలకు వెళతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అర్జీలు రీ ఓపెన్ అయితే కఠిన చర్యలు



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో నమోదయ్యే అర్జీలు రీ ఓపెన్ అయితే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా ఆయా శాఖల జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అర్జీకి నాణ్యతతో కూడిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలను తహసీల్దార్లు స్థానికంగానే పరిష్కరించాలని తెలిపారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న దాత, కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): బెంగళూరుకు చెందిన రంగస్వామిరెడ్డి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాత కుటుంబ సమేతంగా సోమవారం స్వామివారి దర్శనార్థం విచ్చేసి, ఆలయాధికారులకు గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందజేశారు. వారికి ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

ఏనుగు మృతిపై విచారణ కమిటీ


చిత్తూరు కార్పొరేషన్: ఏనుగు మృతిపై విచారణ కమిటీ వేసినట్లు డీఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. సదుం మండలం బూరగమంద పంచాయతీ గంటావారిపల్లె సమీపంలో ఈనెల 7వ తేదీన ట్రాన్స్‌ఫార్మర్ ఢీకొనడంతో విద్యుత్‌షాక్‌కు గురై ఏనుగు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ కమిటీ వేసినట్లు డీఎఫ్ఓ తెలిపారు. పలమనేరు, పుంగనూరు రేంజర్లు శివన్న, బాలకృష్ణారెడ్డిని విచారణ అధికారులుగా నియమించామన్నారు. ఏనుగు మృతికి గల కారణాలు, ఏనుగు రాకను ముందుగా సిబ్బంది ఎందుకు గుర్తించలేదు, ట్రాన్స్‌ఫార్మర్ ఎంత ఎత్తులో ఉందనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి నివేదికను ఈనెల 16వ తేదీలోపు సమర్పించాలన్నారు. ఇటీవల అటవీ, విద్యుత్ శాఖలు సంయుక్తంగా జరిపిన సర్వేలో అడవిలో 3 మీటర్ల ఎత్తులో 260 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నట్లు లెక్కించామన్నారు. వీటితో పాటు తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించామన్నారు. సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు నివేదించినట్లు తెలిపారు.

పంచమి తీర్థానికి విస్తృత ఏర్పాట్లు



చంద్రగిరి(తిరుచానూరు): పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన నవంబర్ 18న పంచమి తీర్థానికి విశేషంగా భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. తిరుచానూరులో పంచమి తీర్థం ఏర్పాట్లను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పుష్కరిణిలో గేట్లు, పంచమి తీర్థ మండపాన్ని, పద్మ సరోవరాన్ని పరిశీలించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా పుష్కరిణిలోనికి ప్రవేశించేందుకు, తిరిగి బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

పుంగనూరులో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలో తయారు చేయనున్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సు



ఎలక్ట్రిక్ బస్.. రైట్ రైట్

ఇంధన వనరుల తరుగుదల..పర్యావరణ కాలుష్యం నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరు అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటుపై సీఎంతో చర్చించారు. అందుకు ఆయన అంగీకరించి.. జర్మన్‌కు చెందిన పెప్పర్ బస్సుల తయారీ సంస్థ స్థాపనకు ఆమోదించారు. ఆ పరిశ్రమ యాజమాన్యం కూడా ఫ్యాక్టరీ స్థాపనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



- జర్మన్ పెప్పర్ పరిశ్రమ స్థాపనకు గ్రీన్ సిగ్నల్
- ముఖ్యమంత్రి జగన్‌కు పెప్పర్ కృతజ్ఞతలు
- 29న సీఎంతో సమావేశం
- రూ.5వేల కోట్లతో పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల తయారీ
- 2027కు మార్కెట్‌లోకి 50 వేల వాహనాలు
- మరో 10 అనుబంధ కంపెనీలు రాక
- పదివేల మంది నిరుద్యోగులకు ఉపాధి
- దేశ వ్యాప్తంగా పుంగనూరుకు గుర్తింపు

పుంగనూరు: పెద్దాయన సొంత నియోజకవర్గమైన పుంగనూరులో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జర్మన్ పెప్పర్ కంపెనీ ఎలక్ట్రికల్ బస్సుల తయారీ పరిశ్రమ స్థాపనకు తొలిసారిగా ఇక్కడికి రానుండడంతో పుంగనూరు చరిత్రకెక్కనుంది. పుంగనూరులో పరిశ్రమల ఏర్పాటు చేయాలని రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రా మచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిలు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని కోరారు. ఇందుకు సీఎం అంగీకరించడంతో గత నెల 30న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఎలక్ట్రిక్ బస్సుల కంపెనీ పుంగనూరులో ఏర్పాటు కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కంపెనీ కృతజ్ఞతలు తెలిపింది.

రూ.5 వేల కోట్లతో ఏర్పాటు

జర్మనీలో ఉన్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సులు, ట్రక్కులు, బ్యాటరీల తయారీ సంస్థ సుమారు రూ.5 వేల కోట్లతో ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మించనుంది. పుంగనూరు మండలంలోని ఆరడిగుంట, మేలుందొడ్డితోపాటు పెద్దపంజాణి మండలంలోని కరసనపల్లె రెవెన్యూ గ్రామాల్లో 800 ఎకరాల్లో భూమిని కేటాయించేందుకు మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి అంగీకరించారు. ప్రస్తుతం పరిశ్రమలకు కేటాయించిన రెండు వేల ఎకరాల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు కానున్నది. దీని ద్వారా పదివేల మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనుంది.

పుంగనూరుకు నీటి లభ్యతతో..

పుంగనూరులో రాష్ట్ర విద్యుత్, భూగర్భ వనరుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలు నీటి సమస్య పరిష్కరించేందుకు పుంగనూరు మండలంలోని నే తిగుట్లపల్లె, సోమల మండలంలోని ఆవులపల్లె వద్ద రెండు రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు. అలాగే వైఎస్సార్ జిల్లా గండికోట ప్రాజెక్టు నుంచి పైపులైన్ల ద్వారా పుంగనూరుకు నీరు పుష్కలంగా తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నా యి. దీనికితోడు కర్ణాటక సరిహద్దులోని జాతీయ రహదారులను పుంగనూరుకు అనుసంధానం చే శారు. ఫలితంగా పారిశ్రామిక వేత్తల కళ్లు పుంగనూరుపై పడేలా చేయడంలో ఎంపీ మిథున్‌రెడ్డి వి జయం సాధించారు. ఆయన ఆలోచనలు నేడు కార్య రూపం దాల్చాయి. పారిశ్రామిక వేత్తలు పుంగనూరును అనువైన ప్రాంతంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తికి చెందిన ఫెర్రో ఆలాయ్ పైపుల ఫ్యాక్టరీ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి.

29న సీఎం చెంతకు ప్రతినిధుల బృందం

పుంగనూరులో ఏర్పాటు చేయనున్న పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫౌండర్లు క్రిష్టియన్ వాగ్నర్, బ్యాస్టియన్ ఫెడ్రిచ్, సీఈఓ ఆండ్రియస్, సీఐఓ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 12 మంది బృందం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఈనెల 29న కలిసి కంపెనీ ఏర్పాట్లపై చర్చించనున్నారు.

నెలాఖరుకు పుంగనూరుకు..

పుంగనూరుకు పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫౌండర్లు క్రిష్టియన్ వాగ్నర్, బ్యాస్టియన్‌ఫెడ్రిచ్ తో కూడిన బృందం ఈనెలాఖరులో పుంగనూరులో పర్యటిస్తారని ఎంపీ మిథున్‌రెడ్డి తెలిపారు. కంపెనీ భూసేకరణకు సంబంధించి వివరాలు వెల్లడిస్తారన్నారు. త్వరలోనే కంపెనీ నిర్మాణ పనులను సీఈఓ ఆండ్రియస్, సీఐఓ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

దేశ చరిత్రలో నిలిచిపోతాం

పుంగనూరు మండలం ఆరడిగుంటలో జర్మనీ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ నెలకొల్పేందుకు ముందుకు రావడం పుంగనూరు ప్రజల అదృష్టమని, దేశ చరిత్రలో పుంగనూరు పేరు నిలిచిపోతుందని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ తెలిపారు. సోమవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో పుంగనూరు పారిశ్రామికాభివృద్ధి చెందుతోందన్నారు. 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగన్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి కుటుంబం చేసి చూపిందన్నారు. ప్రభుత్వానికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అమరనాథరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ నాయకులు కొత్తపల్లె చెంగారెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, సుబ్రమణ్యం, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్. చిత్రంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరుకు ప్రత్యేక స్థానం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరుకు ప్రత్యేక స్థానం కల్పించారు. బైపాస్ రోడ్డు, మినీ బైపాస్, ఆర్టీసీ డిపో, వంద పడకల ఆస్పత్రి, ఎంబీటీ రోడ్డు విస్తరణ, పాలిటెక్నికల్ కళాశాల, సబ్‌స్టేషన్లతో పాటు ప్రతి గ్రామానికీ సిమెంటు రో డ్లు, కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏ ర్పాటు చేశారు. నలభైఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేపట్టాం. ప్రజలకు అ న్ని విధాల అండగా ఉంటాం. పుంగనూ రు అభివృద్ధే మా ధ్యేయం.

– రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


జగనన్నతోనే అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పాద యాత్రలో ఇచ్చిన హా మీ మేరకు పుంగనూరుకు ప్రత్యేక ని ధులు కేటాయించా రు. అభివృద్ధికి దూరమైన పుంగనూరులో అభివృద్ధి పరుగులు తీస్తోంది. రెండు రిజర్వాయర్లు, గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్లతో సాగు, తాగునీరుకు లభిస్తుందన్న నమ్మకం ప్రతిఒక్కరిలోనూ ఉంది. దీంతోనే పారిశ్రామికవేత్తల పుంగనూరుకు వస్తున్నారు. పరిశ్రమల ద్వారా నిరుద్యోగ సమస్య పూర్తిగా నిర్మూలించి, పుంగనూరును ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తాం. పుంగనూరు అభివృద్ధికి సహకరిస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

2027నాటికి 50 వేల వాహనాలు



పుంగనూరులో పెప్పర్ ఎలక్ట్రికల్ బస్సుల ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి, 2027 సంవత్సరం నాటికి సుమారు 50 వేల బస్సులు, ట్రక్కులతో మార్కెట్‌లోకి విడుదల చేయడానికి కంపెనీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన సిబ్బంది, ముడిసరుకు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీకి చెందిన 10 కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలోని టీడీపీ నాయకులతో పాటు 10 కుటుంబాల వారు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మురళి, దేవేంద్ర, శంకర, మోగులప్ప, రామచంద్ర, తిప్పన్న, నారాయణ స్వామి, కృష్ణమూర్తి, రమణన్న, సురేష్ వెంకటరమణ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో యల్లారబైలు వైస్సార్‌సీపీ నాయకులు అలకం బాబు తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు ఈహెచ్‌ఎస్ సౌకర్యం

– డీఈఓ విజయేంద్రరావు వెల్లడి



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయీస్ హెల్త్ స్కీం(ఈహెచ్‌ఎస్) సౌకర్యం కల్పిస్తూ జీఓ 271 జారీ చేసిందని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈహెచ్‌ఎస్ సౌకర్యంతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు మేలు కలుగుతుందన్నారు. మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉద్యోగులు వైద్యం కోసం వెచ్చించే మొత్తం మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద వెనక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులు ఎవరైనా దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడినా, రోడ్డు ప్రమాదాలకు గురైనా ఈహెచ్‌ఎస్ సౌకర్యం తో ఆస్పత్రుల్లో చికిత్స పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని 7 మోడల్ స్కూళ్లలో విధులు నిర్వహిస్తున్న 150 మంది ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ సౌకర్యంతో మేలు కలుగుతుందన్నారు. ఉద్యోగులు శస్త్రచికిత్సలు సైతం చేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని డీఈఓ వెల్లడించారు.

విద్యాదీవెనకు ఉమ్మడి ఖాతా తెరవాలి



రాజ్యలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఆయా విద్యాసంస్థల్లో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జగనన్న విద్యాదీవెన పథకం లబ్ధికి ఉమ్మడి ఖాతా తెరవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జగనన్న విద్యాదీవెన నాలుగో విడత పథకం లబ్ధి కోసం సంబంధిత విద్యార్థి, తల్లి పేరుతో జాయింట్ ఖాతా తప్పనిసరిగా ఈ నెల 24వ తేదీ లోపు తెరవాలని చెప్పారు. ఈ నెల 28వ తేదీన జగనన్న విద్యాదీవెన నాలుగో విడత పథకం నిధులు ప్రభుత్వం విడుదల చేయనుందని తెలిపారు. విద్యార్థి, తల్లి పేరుతో ఉమ్మడి బ్యాంక్ ఖాతా ఉంటేనే జగనన్న విద్యాదీవెన నాలుగో విడత లబ్ధి చేకూరుతుందన్నారు. ఎస్సీ విద్యార్థులకు జాయింట్ ఖాతా అవసరం లేదన్నారు. బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు, ఎస్టీ ఉమ్మడి ఖాతా తెరవాలని చెప్పారు. అలాగే 2022–23 విద్యాసంవత్సరంలో డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఉమ్మడి ఖాతా అవసరం లేదని పేర్కొన్నారు.

శాస్త్రోక్తం.. కేదారేశ్వరగౌరీ వ్రతం



పురవీధుల్లో విహరిస్తున్న వరసిద్ధుడు



మణికంఠేశ్వర స్వామి ఆలయంలో కేదారేశ్వర గౌరీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వస్వామి ఆలయంలో ఆలయ అర్చక, వేదపండితులు శాస్త్రోక్తంగా కేదారేశ్వర గౌరి వ్రతం నిర్వహించారు. సోమవారం దీపావళి నోములు సందర్భంగా ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో కేదారేశ్వర గౌరీ వ్రతాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి, వ్రతాన్ని ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని నోములను నోమి ఉపవాసాలు వీడారు.

ఘనంగా గ్రామోత్సవం

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా సోమవారం మధ్యాహ్నం సిద్ధి బుద్ధి వినాయకస్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులకు విశేషాలంకరణ చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు స్వామివారికి కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,807 మంది స్వామివారిని దర్శించుకోగా 21,974 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కా నుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ ద ర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బస్సులో 40 సవర్ల బంగారు చోరీ

చిత్తూరు అర్బన్: బస్సులో ఊరికి వెళుతూ బంగారాన్ని తీసుకెళుతున్న మహిళల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 40 సవర్ల బంగారు చోరీ చేశారు. చిత్తూరు నగరంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి.. శ్రీరంగరాజపురం క్షీరసముద్రం గ్రామానికి చెందిన రమ, అనసూయ ఇద్దరూ అక్కాచెల్లెళ్లు. సోమవారం కేదారి గౌరి వ్రతం అనంతరం బెంగళూరులో ఉన్న తన తమ్ముడి ఇంటికి కర్ణాటక ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఎస్ఆర్ పురం కూడలి వద్ద ఇద్దరు మహిళలూ తమ వద్ద ఉన్న 40 సవర్ల బంగారు ఆభరణాలను బ్యాగులో ఉంచుకుని బస్సు ఎక్కారు. బస్సు చిత్తూరు నగరంలోని ఎస్టేట్ సమీపంలోకి వచ్చేటప్పటికి వారి బ్యాగు కనిపించలేదు. కంగారుపడిన మహిళలు బస్సు మొత్తం వెతికినా ప్రయోజనం లేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. బంగారు నగలు ఎక్కడ పోగొట్టుకున్నారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం కార్తీక మాసోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. కార్తీక మాసోత్సవాల్లో మొదటిరోజు ఆలయ అర్చకులు ఆకాశదీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి పాల్గొన్నారు. అనంతరం ఆకాశదీపాన్ని ప్రత్యేక స్తంభానికి పైభాగంలో ఆకాశంవైపుగా వేలాడుతుండేలా ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

40 మంది లైన్‌ఇన్‌స్పెక్టర్లకు డిప్యూటేషన్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో నిర్మాణ విభాగానికి జిల్లాలోని ఆపరేషన్, రూరల్స్ డివిజన్లలోని 40 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లను డిప్యూటేషన్ వేసినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్లెలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయడానికి జిల్లాలో ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా సర్వే జరుగుతోందన్నారు. ఈ పనుల కోసం వారిని డిప్యూటేషన్‌పై నిర్మాణ విభాగానికి పంపామని తెలిపారు. దీంతో సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ సర్వీసులు సకాలంలో ఇవ్వకపోతే ఏఈ, డీఈ, ఈఈలపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఏఈలు పెండింగ్‌లో ఉన్న వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయాలన్నారు. లేకపోతే జీతాల నుంచి కట్ చేస్తామని హెచ్చరించారు.

సారా తయారీదారుడిపై పీడీ యాక్టు



శశికుమార్ (ఫైల్)

చిత్తూరు అర్బన్: సారా తయారీనే వృత్తిగా ఎంచుకున్న నిందితుడు ఎ.శశికుమార్ పై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. నిందితుడిని ఆదివారం చిత్తూరు జిల్లా జైలు నుంచి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. చిత్తూరు ఎస్‌ఈబీ అర్బన్ సీఐ జోగేంద్ర కథనం మేరకు.. గుడిపాల మండలం చిత్తపార గ్రామానికి చెందిన ఎ.శశికుమార్(35) గుడిపాల మండలంలోని అటవీ ప్రాంతాల్లో సారా తయారు చేయడమే వృత్తిగా ఎంచుకున్నాడు. ఇక్కడ తయారు చేసిన సారాను జిల్లాలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేయడంతో పాటు తమిళనాడుకు కూడా పంపేవాడు. ఈ క్రమంలో శశికుమార్‌పై ఎస్‌ఈబీ పోలీసులు ఎనిమిది కేసుల్లో అరెస్టు చేశారు. పలుమార్లు హెచ్చరించినా ఇతని అతను తమ వృత్తి మార్చుకోకపోవడంతో పీడీ యాక్టు ప్రయోగించడానికి ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపగా, ఆయన ఆమోదం మేరకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. ఈ మేరకు నిందితుడ్ని కడప జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సేవలు మరిచి..



- జిల్లా ఆస్పత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం
- అత్యవసర విభాగంలో అవస్థలు
- పరీక్షలు రాస్తే రోగులకు పరీక్షే
- ప్రసూతి విభాగంలో వసూళ్ల దందాలు
- కలెక్టర్లు మందలించిన మారని తీరు

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవల్లో నిర్లక్ష్యం దాపరిస్తోంది. వైద్య సిబ్బంది, అధికారుల కుంటిసాకులతో ఆస్పత్రి కుంటుపడుతోంది. అపోలో, ప్రభుత్వ వైద్యుల సమన్వయలోపంతో ఆస్పత్రి నిర్వహణ గాలిలో దీపంలా మారింది. దీనిపై జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఈ విషయమై కలెక్టర్ మందిలించినా మార్పు రాక, ఆస్పతి విచారణ బాధ్యత వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్ చేతిలోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన చిత్తూరు ప్రభుత్వాస్పని తనిఖీ చేయనున్నారు.

చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో 12 విభాగాలు, 400 పడకలున్నాయి. రోజూ ఇన్‌పేషెంట్లు 250 నుంచి 300 మంది ఉంటున్నారు. అవుట్‌పేషంట్‌లు 1200 మంది వరకు వస్తున్నారు. అత్యవసర సేవలకు 150 మంది వరకు వస్తున్నారు. అయితే ఆస్పత్రి అపోలో, ప్రభుత్వ ఆధీనంలో నడుస్తుండడంతో వీరిరువురి మధ్య సమన్వయ లోపంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

సమన్వయలోపమే కారణమా..?

ఆస్పత్రిలో నిర్లక్ష్యం, లోపాలకు ఎవరు బాధ్యత వహిస్తున్నారనే విషయం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఏ ఘటన జరిగిన అపోలో నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు తమకు సంబంధం లేదని చేతులెత్తేస్తున్నారు. మందులు, మాత్రలు, ఇతరాత్ర విషయాల్లో పొదుపు పాటిస్తున్నట్లు నిర్వాహకులే నోరు విప్పుతున్నారు. ఖర్చు చేయాల్సింది అపోలో వాళ్లేనన్ని ప్రభుత్వ అధికారులు వదిలించుకుంటున్నారు. ఈ సమస్యపై గతంలో కలెక్టర్‌గా ఉన్న భరత్‌గుప్త, హరినారాయణన్, ప్రస్తుత కలెక్టర్ షణ్మోహన్ కూడా పలుమార్లు మందలించారు. అయినా మార్పులేదని గుర్తించారు. దీంతో ఆ మార్పు బాధ్యతలను వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు వదిలిపెట్టారు. ఆయనొస్తే ఏ రకంగా ఆస్పత్రిలో మార్పు చేర్పులుంటాయనేది వేచి చూడాల్సిందే.

- చిత్తూరు నగరం శంకరయ్యగుంటకు చెందిన ధరణి అనే మహిళ గత ఆగస్టు 28వ తేదీన కడుపునొప్పితో చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు స్కానింగ్‌కు రాయించారు. క్యూలో నిలబడి స్కానింగ్ తీయించుకున్న ఆమెకు ఎలాంటి అనారోగ్య సమస్య లేదని నిర్ధారించారు. తీరా భరించలేని నొప్పితో అక్టోబర్ 28న చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయించింది. అక్కడ స్కానింగ్ చేయిస్తే గర్భసంచి సమస్య ఉందని నిర్ధారించారు.
- తమిళనాడుకు చెందిన రమ్య(పేరుమార్చాం) గత నెల ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. అడ్మిట్ చేసిన మరుసటి రోజు ఆమెకు సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తీశారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది తల్లి కుటుంబ సభ్యుల నుంచి రూ. 4 వేలు గుంజుకున్నారు. అక్కడి నుంచి ఆమెను ఐసీయూకు తరలించేందుకు రూ. 200 ఇచ్చుకున్నారు. తర్వాత క్లీనింగ్ అంటూ మరో రూ.100 అడిగి తీసుకున్నారు. మళ్లీ మూడు రోజుల తర్వాత పైకి తరలించారు. తరలించిన ఆమెకు రూ. 100 ఇచ్చుకోవాల్సి వచ్చింది.

జిల్లా ఆస్పత్రి నిర్వహణ ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు.. నిర్ణీత గడువులోపు ఆస్పత్రి అభివృద్ధికి ఒప్పందం కుదురుకున్నారు. దీన్ని ఆ సంస్థ పట్టించుకోకుండా సేవలు మరిచి పోతే ఏం చేస్తాం.. ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తాం. అయితే ప్రభుత్వ అధికారులు ఆ బాధ్యత తమది కాదని చేతులెత్తేస్తున్నారు. ఈ విషయమై వైద్యవిధాన పరిషత్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.. నేడు ఏపీవీవీపీ కమిషనర్ దీనిపై విచారణ జరపనున్నారు. ఏం జరుగుతుందో చూడాల్సి ఉంది.

నేడు ఏపీవీవీపీ కమిషన్ రాక

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్(ఏపీవీవీపీ) కమిషనర్ సందర్శించనున్నారని ఇన్‌చార్జి డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఆయన ఆస్పత్రికి చేరుకుంటారన్నారు. సందర్శన అనంతరం అధికారులు, ఆస్పత్రి అధికారులతో సమావేశం కానున్నరని ఆయన పేర్కొన్నారు.

సమస్యలిలా..

- అత్యవసర విభాగంలో సీనియర్ సివిల్ సర్జన్ లేరు. పీజీ విద్యార్థులతో నడుస్తోంది. దీంతో అత్యవసర సేవల కోసం వచ్చే వారికి అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయి. కాస్త కడుపు నొప్పితో వచ్చినా రెఫర్ రాసి ఇచ్చేస్తున్నారు. రోగులు గంటల తరబడి వేచి ఉండి డాక్టర్లను ప్రసన్నం చేసుకోవాల్సి వస్తోంది. ప్రశ్నిస్తే తమ వల్ల కాదని రెఫర్ రాస్తున్నారు.
- స్కానింగ్ సెంటర్లలో తూతుమంత్రంగా స్కానింగ్ చేయిస్తున్నారు. అసలు ఇక్కడ రిపోర్టులకు ప్రైవేటుకు పొంతన ఉండడం లేదు. అంతా తప్పుడు రిపోర్టులు ఇచ్చేస్తున్నారని రోగులు లబోదిబోమంటున్నారు. ఇక టోకన్లు ఇచ్చే విధానాన్ని ప్రోత్సాహిస్తూ, స్కానింగ్ సేవలను ఒంటిపూటకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. సిపార్సులుంటే ఐదు నిమిషాల్లో స్కానింగ్ సేవలు ముగిసిపోతున్నాయి.
- ల్యాబ్ పరీక్షల్లో పెద్ద ఎత్తున్న గోల్‌మాల్ జరుగుతోంది. సేకరించిన శ్యాంపిళ్లను పరీక్షించకుండా ఉత్తుత్తిగా రిపోర్టులు ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయట ఇచ్చే రిపోర్టుకు, ఇక్కడకు ఇచ్చే దానికి చాలా వ్యత్యాసం ఉన్నట్లు రోగులు చెబుతున్నారు. తర్వాత ల్యాబ్ టెస్టుల పేరుతో ఆస్పత్రిలో ప్రైవేటు దందా నడుస్తోంది. అనవసరంగా టెస్టులు రాసిచ్చి, పేదల నుంచి కాసులు దండుకుంటున్నారు. కొందరు సిబ్బంది కమీషన్లకు కక్కుర్తి పడి పేదల రక్తాన్ని అమ్మకానికి పెడుతున్నారు. ఉదాహరణకు వడదెబ్బకు గురైన ఓ మహిళకు థైరాయిడ్ టెస్టు రాసిచ్చి, ఓ పీజీ డాక్టర్ నవ్వుల పాలయ్యాడు.
- ప్రసూతి విభాగంలో కొన్ని చోట్ల వసూళ్ల పరంపరసాగుతోంది. ప్రసవించిన మహిళ కుటుంబ సభ్యులను పట్టిపీడిస్తున్నారు. ఇచ్చిన తృప్తి చెందకుండా అందినకాడికి దోచుకోవాలని చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక అడగడుగునా కాసులు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు వాపోతున్నారు.
- కనీసం వీల్‌చైర్లు కూడా పలు విభాగాల వద్ద కనిపించకుండా పోతున్నాయి. వాటిని పలవురు సిబ్బంది ఇతర అవసరాల కోసం తోపుడు బండ్లను వాడుకుంటున్నారు. అవసరమైనప్పుడు రోగుల కుటుంబసభ్యులు వీల్ చైర్ల కోసం వెతుకోవాల్సిన పరిస్థితి ఉంది.
- గ్లౌసులు, కుట్లు వేసే సూదులు, ఇతరాత్ర వస్తువులు ఆస్పత్రిలో లేవని పలువురు సిబ్బంది, వైద్యులు బయటకు రాయిస్తున్నారు. ఇటీవల జరిగిన ఆస్పత్రి సమావేశంలో ఏ ఒక్కటి బయటకు రాసి, ఇవ్వకూడదని సూచించిన మళ్లీ యథావిధిగానే జరుగుతోంది. కనీసం ఈసీజీకి వాడే జెల్ కూడా కొనుగోలు చేయని పరిస్థితి నిర్వాహకులది. ప్రభుత్వం నుంచే వచ్చే స్టాక్ మాయమవుతుందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.
- ఆదివారం, ప్రభుత్వ సెలవుల సమయాల్లో డ్యూటీ డాక్టర్లు కూడా సెలవుల్లోకి వెళ్లిపోతున్నారు. వచ్చినా కొంత సేపటికే మాయమవుతున్నారు. ఇలాంటి తరుణంలో పీజీ డాక్టర్లు, సిబ్బంది మాత్రమే దిక్కుగా మారుతున్నారు. సీనియర్ డాక్టర్ల సలహాలు తీసుకుని మందులు, మాత్రలు రాసి పంపిస్తున్నారు.

పేదల బలగమే వైఎస్సార్‌సీపీ

- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన విజయానందరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: పేదల బలగమే వైఎస్సార్ సీపీ అని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో ఆదివారం ఆయన సమక్షంలో టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీ కార్యకర్తలు మగి, గోవిందరాజులు, చక్రవర్తి, తోటి శ్రీను, చెంగల్‌రాయన్, బాబు, శివ, రాజేష్, కుపేంద్ర, యేసయ్య, అశోక్, జోషి, కుమార్, అన్నాదొరై, శివాజీ, జ్యోతి తదితరులు పార్టీలో చేరారు. విజయానందరెడ్డి వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రతి పథకాన్ని కూడా పారదర్శకంగా ప్రతి ఇంటి తలుపు తట్టి అందిస్తోందన్నారు. పేదలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవిరళ కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్‌బాబునాయుడు, తాళంబేడు సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు టి.కుమార్, మణిబాబు, రాజేంద్ర, వెంకటేష్, బుల్లెట్ బాబు, దాము, కే ఆర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

తుమ్మింద గ్రామంలో వారం రోజుల క్రితం అతిసారం విజృంభించింది. గ్రామంలో తాగునీటి కలుషితం కారణంగా 22 మందికి అతిసార వ్యాధి సోకింది. వీరిలో ఇద్దరు మృతి చెందారు. ఇదే సమయంలో మరో వ్యక్తి అనారోగ్య సమస్యలతో మరణించాడు. మృతులు జోజప్ప, మల్లికతోపాటు అనారోగ్యంతో మరణించిన జయరాజ్ కుటుంబాలకు విజయానందరెడ్డి రూ. 20 వంతున ఆర్థికసాయం అందజేశారు.

సైకిల్ మెకానిక్ కుమార్తెకు అరుదైన గౌరవం

- ఉత్తమ విద్యార్థి అవార్డు అందుకున్న హలీమా
- విద్యార్థినికి అభినందన వెల్లువ



డిప్యూటీ సీఎంఅంజాద్ నుంచి అవార్డు అందుకుంటున్న హలీమా సాదియా, ఆమె తల్లిదండ్రులు

చౌడేపల్లె: మండలంలోని మేదరదొడ్డికి చెందిన సైకిల్ మెకానిక్ కరీముల్లా కుమార్తె హలీమా సాధియాకు అరుదైన గౌరవం లభించింది. ఈమె ఉర్దూ మాద్యమంలో జిల్లాలో ఉత్తమ విద్యార్థినిగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా చేతుల మీదుగా అవార్డు అందుకుంది. వివరాల్లోకి వెళితే చౌడేపల్లె మండలం మేదరదొడ్డికి చెందిన సైకిల్ మెకానిక్ కరీముల్లా కుమార్తె హలీమా సాదియా దాదేపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి, జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈనెల 11వ తేదీన విజయవాడలోని ఏపీ ప్లస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఉత్తమ విద్యార్థినిగా హలీమా సాధియాకు అవార్డుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి, సత్కరించారు. దీంతో ఆమెతో పాటు తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ప్రస్తుతం పలమనేరులోని ఓ ప్రైవేటు కళాశాలలో హలీమా ఇంటర్ చదవుతోంది. అవార్డు అందుకున్న హలీమాను పలువురు అభినందించారు.

కోడి పందేలరాయుళ్ల అరెస్టు

–నగదు, కోడిపుంజులు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కోడి పుంజు

గుడిపాల: కోడిపందెం నిర్వహిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, రెండుకోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సర్కిల్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. గుడిపాల మండలంలోని గుడిపాల పంచాయతీ బుచ్చన్నకండ్రిగ (అనుపు) గ్రామం సమీపంలోని గుట్టలో కోళ్లపందెం నిర్వహిస్తున్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన సీఐ పోలీస్ సిబ్బందితో వెళ్లి కోడిపందెం స్థావరాలపై దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ పందెం ఆడుతున్న రెండు కోళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2 వేల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. మరికొంత మంది పరారీలో ఉన్నారన్నారు. ఇందులో చిత్తూరులోని కట్టమంచికి చెందిన సురేష్(42), తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం తాలూకా, నల్లగానివూరు గ్రామానికి చెందిన విజయకుమార్(34), గుడిపాల మండలం బసవాపల్లె దళితవాడకు చెందిన లాజర్(27), యాదమరి మండలం కాశిరాళ్ల గ్రామానికి చెందిన మంజునాథన్(25)ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. వీరివద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకొన్నామన్నారు. కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంటలపై ఆగని గజదాడులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కమ్మపల్లె పంచాయతీలో రెండురోజులుగా పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. దేశిరెడ్డిగారిపల్లె, కురవపల్లె, దిన్నెపాటి దళితవాడ గ్రామాల్లో ఆదివారం రాత్రి టమాట, వరి, అరటి పంటలపై ఏనుగులు దాడి చేసి, పంటలు ధ్వంసం చేశాయి. దీంతో భారీగా పంట నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. దాదాపు ఏడు ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాయని తెలిపారు. అటవీశాఖ సిబ్బంది ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరిమివేసి కోత కొచ్చిన పంటలను కాపాడాలని కోరుతున్నారు.

గిరిజనులకు పట్టాలు

చిత్తూరు కార్పొరేషన్: అడవులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న 18 మంది గిరిజన కుటుంబాలకు అటవీ భూముల్లో పట్టాలు ఇవ్వనున్నట్లు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగవరం మండలం మాధవరం గ్రామపరిధిలోని కుయ్యవంకలో తరతరాలుగా అడవులపై గిరిజన కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరు నివసించే ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అటవీ భూములను వ్యవసాయ భూముల కింద ఒక్కో కుటుంబానికి 5 నుంచి 8 సెంట్ల వరకు ఇవ్వనున్నమన్నారు. ఇందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. భవిష్యత్తులో అక్కడ కమ్యూనిటీ హాలు, తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



దీప(ఫైల్)

పూతలపట్టు: రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన పూతలపట్టు మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ కథనం మేరకు.. మండలంలోని ఎం.బండపల్లె గ్రామానికి చెందిన మోహన్ భార్య దీప(27) సోమవారం మోహన్‌తో కలిసి మోటర్ సైకిల్‌లో అత్యవసర పనుల నిమిత్తం పూతలపట్టుకు వెళ్లి తిరుగు స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని బండపల్లె సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని కారు ఢీ కొనడం జరిగింది. మోటర్ సైకిల్‌లో వెనుకన ఉన్న దీప కిందపడడంతో తీవ్ర గాయలై అక్కడిక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు వాహనాలు ఢీ.. ఒకరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బ తిన్న రెండు వాహనాలు

రొంపిచెర్ల: కారు, ఐషర్ వాహనాలు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన కోరియర్ ఐషర్ వాహనం వైఎస్సార్ కడప నుంచి తిరుపతికి వెళుతుండగా రొంపిచెర్ల నుంచి పీలేరుకు వెళుతున్న కారు రాత్రి 10 గంటలకు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న ఎస్.విజయకుమార్ రెడ్డి (52)కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అన్నమయ్య జిల్లా పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బ తిన్నాయి. రొంపిచెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.